

# సారీ బ్రదర్

పి.యస్. నారాయణ

**ప**ది సంవత్సరాల తరువాత ట్రాన్స్ఫరయి హైద్రాబాద్ వచ్చిన నాకు, రామం ఆ ఆఫీసులోనే పనిచేస్తున్నాడూ అని తెలిసినప్పుడు నేను సంతోషించినమాట వాస్తవమే!

మా యిద్దరిదీ ఒకే ఊరు...ఒకే ఎలిమెంటరీ స్కూల్...ఒకే హైస్కూలు ...కాలేజీల్లో చేరేసమయంలోనే గాబోలు ...వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్ఫరవ్వటంతో దూరమవ్వటం జరిగింది.

తరువాత ఇన్ని సంవత్సరాలకు ఇప్పుడు ఇలా కలుసుకోవటం తటస్థించింది.

చిన్నప్పుడు కలిసి చదువుకున్న వాళ్ళంతా గుర్తున్నారా అంటే చెప్పడం కష్టమేగాని—రామం మా బలాదూరు గ్రూపుకు రింగ్ లీడర్...'మా' అని ఎందుకంటున్నానంటే నేను గూడా అందులో సభ్యుణ్ణే గనుక...

వాడు చాలా ఎడ్వంచరస్ ఫెలో...

...ఏడో క్లాసులో చదువుతున్నప్పుడే —ముందుబెంచీలో పక్క పక్కనే కూర్చునే సరోజా, రుక్మిణిల జడలు కలిపి ముడివేసిన మహాఘనుడు...

ఒకటి రెండు సార్లు వీడిమూలంగా —వీడికేగాకుండా, నాలాంటి యిద్దరు

ముగ్గురికిగూడా స్కూల్లో టీ.సీ.లు లభించే పరిస్థితులు ఏర్పడినయ్...

ఇన్ని సంవత్సరాల తరువాత ఈ నాడు వాడిని చూస్తుంటే అవేమీ గుర్తుకు రాలేదు — కళ్ళల్లోనూ, హృదయం లోనూ — చిన్ననాటి ఆత్మీయతే చిలికింది.

మూడురోజుల పాటు హైద్రాబాదంతా ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ తిరిగాం. అప్పటికీ ఒకసారి అడిగానుగూడా —'నీ లీలలు ఏవైనా తగ్గాయా?' అని!

వాడు నవ్వేసి ఊరుకున్నాడు.

"పెళ్ళయిందా?"

"అయింది."

"పిల్లలా?"

"ఇద్దరు...ఒక అమ్మాయి, ఒక అబ్బాయి...మా యింటికి వెళ్దాం పద!"

"ఇప్పుడా ఆ ఊరిబయట కొంపకి ...మా శ్రీమతినిగూడా రానీయ్... పిల్లలతోసహా ఓ ఆదివారం వస్తాం!" నవ్వేసి భుజం తట్టాను.

* * *

మూడురోజుల తరువాత ఓనాడు మా ఆఫీసరు తనగదిలోకి లంచ్ టైంలో పిలిచాడు.

వెళ్ళి ఎదురుగ్గా కూర్చున్నాను.

"మీకు రామం బాగా తెలుసా?"

"ఆఁహాఁ..." అన్నాను.

ఒక్క-క్షణం సాలోచనగా ఆగి, "సారీ బ్రదర్! నేను ఇలాఅంటున్నానని ఏఁవీఅనుకోవద్దు ... అతడిని గురించి కాస్త శ్రద్ధ తీసుకోగూడదూ మీరు!" అన్నాడు నా ముఖంలోకి చూస్తూ.

"ఏఁవైంది?" అన్నాను - అయన మాటలు నాకు కాస్త ఆశ్చర్యాన్నే కలిగిస్తున్నయ్.

"అతడిని గురించి మీకేమీ తెలియదా?"

"మూడురోజులేగదా అయింది నేను ఇక్కడకు వచ్చి...పది సంవత్సరాల తరువాత చూస్తున్నాను వాడిని!" అన్నాను.

ఆయన చిన్నగా నవ్వాడు.

"మీకు ఆయన మిత్రుడు...నామీద మీకున్న గౌరవం తగ్గకుండా అతడిని గురించి మీకెలా చెప్పాలో నాకు అర్థం కావడంలేదు!" అన్నాడు కాస్త మాటల్లో ఇబ్బందిపడుతూ.

"మీరు చెప్పిందే నిజమయినప్పుడు —మిమ్మల్ని అపార్థంచేసుకునే ప్రశ్నే రాదు!" చాలా తూచి తూచి చిన్నగా అన్నాను.

"రామం చెడిపోయాడు!"

"అంటే?"


"త్రాగుతాడు!"

"అంతేనా?"

"చెడతిరుగుతాడు!"

"వివరంగా చెప్పండి!"

"చెప్పాలంటే కష్టంగానే వుంటుంది



పోలికలు

...రోజుకో అమ్మాయిని గుడ్డలమీద మోజున్నవాడు మార్చినట్లుగా మారుస్తుంటాడు—ఆపైన చతుర్ముఖ పారాయణం సరేసరి!" అన్నాడు బరువు తీరినట్లుగా నవ్వి.

నేను మాట్లాడలేకపోయాను. రామం గుణం నాకు తెలిసిందేగనుకు ఆయన చెప్పినదాన్ని పూర్తిగా కొట్టివేయాల్సిన అవసరం లేదనే అనిపించింది!

మూడుగంటలప్పుడు నా కొలీగ్ శాస్త్రి క్యాంటీన్‌కు నన్ను లాక్కువెళ్ళి రామం విషయం మొదలుపెట్టాడు.

"సారీ బ్రదర్! మా వంతయిపోయింది ...మేం చెప్పాల్సిందేదో చెప్పేశాం... కానీ అతగాడు మా మాటలకు ఏమాత్రం విలువ యివ్వలేదు...కనుక మీరయినా ప్రయత్నించండి. సాటివాడు, మనవాడు అనే మమకారంతో—చెడిపోతున్నాడనే బాధతో ఇదంతా చెప్పవలసివస్తున్నది!"

"అంతగా పాడయిపోయాడా?"

"పాడయిపోతున్నావూ అంటే—అతడు అంగీకరించడు-నేను జీవితాన్ని అనుభవిస్తుంటే మీరంతా ఎందుకు పడి ఏడుస్తారూ—అంటాడు!" నవ్వాడు శాస్త్రి.

సాయింత్రం అయిదవుతుండగనే ఇంటికి పోయేటందుకుగాను రామం నా సీటు దగ్గరకు వచ్చాడు.

ఇంతమంది ఇలా చెబుతున్నప్పుడు మిత్రుడిగా నా కర్తవ్యం గుర్తుకు వచ్చింది—అందుకే వాడి యింటికి వెళ్ళి వాడి పరిస్థితులు గమనించితీరాలి అనిపించింది.

"అరేయ్ రామం! మా యింటికిరా,

మా యింటికి రా అని అంటుంటివిగదా ...ఇవ్వాళ వెళ్దాం పద...నాకు ఏ ఎంగేజ్‌మెంటూలేదు!" అన్నాను.

వాడు ఫక్కున నవ్వాడు! "సారీ బ్రదర్' నాకు ప్రోగ్రాం ఫిక్సయిపోయింది...మా శ్రీమతికి సినిమాకు తీసుకువెళతానని ప్రామిస్ చేశాను... ఎండలు మండనీయ్...వానలు కురవనీయ్ ... ప్రామిస్ – ప్రామిసే ..." అన్నాడు "అఫ్‌కోర్స్! నీవుగూడా సినిమాకు వస్తానూ అంటే...చలో!''

వాళ్ళిద్దరి నడుమా నేను దేనికి?

''ఓకే...క్యారీ ఆన్!"

—వాడు ఆ మాటలు ఎంతో సిన్సియర్‌గా చెప్పాడనిపించింది.

ఇన్ని దుర్గుణాలు వున్నవాడు పెళ్ళాన్ని సినిమాకు గూడా తీసుకువెళతాడా?

ఏమో...

మరునాడు ఈమాటనే వాసుతో అంటే (వాసు మా కొలీగ్)—రామం విషయం వచ్చినప్పుడు—దానికి అతడు నవ్వేసి, "ఏ పెళ్ళాన్ని తీసుకువెళుతున్నాడో చెప్పాడా మీకు?" అన్నాడు

—నేను నోరు తెరిచినమాట వాస్తవమే!

ఆఫీసంతా రామం గురించి ఎంత చెడ్డగా చెప్పుకోవాలో అంతగానూ చెప్పుకుంటున్నారు. నా మనస్సు చాలా బాధపడింది.



పో లి క లు

అంతకంటేగూడా నన్ను బాధించింది—రామం మిత్రుడనయిన నన్ను ప్రతివాడూ జాలిగా పలకరించటం, పరామర్శించటం — ఆపైన వాడిని గురించి నాలుగు సానుభూతివాక్యాలు పలకటం...నన్ను అతగాడికి చెప్పి బాగుపరచమనటం...

నాకు వాళ్ళధోరణి విసుగూ, కోపం గూడా కలిగిస్తోంది.

వాడికి నేనేమైనా తోడబుట్టిన వాడినా?

ఎవడెట్లాపోతే నాకేం?

మధ్యలో నేనెందుకు నా తల దూర్చాలి!

మరో ఆలోచన...మనస్సు నిలవటం లేదు—నిజంగా చెడిపోతున్నప్పుడు—పెద్దవాడినిగా, మిత్రుడిగా, ఆత్మీయుడిగా, 'రామం! ఇది నీకు తగదురా!'

అని చెప్పి బాగుపరచటంలో తప్పు లేదేమో?

వాడు బాగుపడితే అంతకుమించి కావల్సిందేమున్నది?

అందుకే—

మా ఆవిడ రాగానే దాన్ని తీసుకు వెళ్ళి నేను వాడితో ముందుగదిలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే—ఆవిడగారు లోపల రామంగాడి ఆవిడ గారితో కూర్చొని వాడి గుట్టుమట్లన్నీ లాఘవంగా లాగగలదని నా ఆశ

ఆవిడగారు పుట్టింటినుండి విచ్చేయ టానికి ఇంకా ఎంత లేదన్నా నాలుగు రోజులుపడుతుంది. పట్టనీయ్...అంతగా చెడినవాడు ఈ నాలుగురోజుల్లో ఇంకా కొత్తగా చెడేదేమున్నది?

ఆ సాయంత్రం శేఖరం రోడ్డుమీద కనబడితే—వంటరిగా తిరుగుతున్న నేను అతడిని పలకరించాను. యిద్దరం కాఫీ త్రాగాం.

మా మాటల్లో రామం ప్రసక్తి తప్పనే లేదు.

"సారీ బ్రదర్! నాదొక్క సలహా ...మీరు త్వరపడి అతడి విషయాల్లో వేలుపెట్టబోకండి ... అతడు ఇప్పుడు ఒకళ్ళు చెబితే వినే స్టేజిలో లేడు...మీ మాటయినా—మీరు అతడికి మిత్రులే అవ్వవచ్చు—వింటాడనే నమ్మకం నాకు లేదు ... అలాంటి లేని నమ్మకంతో మనమేదో నీతులు చెప్పబోయి అభాసు పాలవ్వడం తెలివిగలవాళ్ళ పని గాదు...''

నిజమే! అతడు చెప్పిందీ కరెక్టే...

...ఏవో లేనిపోని ఉపదేశాలు చెప్పి, వినకపోంగా స్నేహాన్నే చంపేసు కోవటం దేనికి?...

ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు?

*　　*　　*

ఉన్నట్లుండి రామం మర్నాడు ఆఫీసుకు రాలేదు.

కాస్త లేటుగా వస్తాడనే అనుకున్నాను గాని—వాడు రాకపోవటాన్ని అంతగా నేను పట్టించుకోలేదు.

అయితే శాస్త్రి నన్ను వదలలేదు.

"సారీ బ్రదర్! నాతో ఒక్కసారి వస్తారా?" అన్నాడు మధ్యాహ్నం రెండుగంటలప్పుడు.

లేచి బయటకు వచ్చాను.

మీకు మామీద ఏలాంటి దురభి ప్రాయమూ వుండగూడదనే సదుద్దే శ్యంతో ఓ చిన్నమాట చెప్పివెళ్దామని వచ్చాను...మేమేదో మీ రామంమీద కూడగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నా మని మీరెక్కడ అపోహపడతారోనని మా భయం!"

"అబ్బెబ్బే...మీరేమైనా శత్రువులా వాడికి!" ఇబ్బందిగా అతడి ముఖంలోకి చూస్తూ అన్నాను "మనం ఎవరిమైనా వాడి సౌభాగ్యమేగదా కోరుకునేది!"

"కృతజ్ఞుణ్ణి!"



"ఇంతకీ అసలుసంగతి చెప్పండి!" అన్నాను.

"మీరు 'బి' సెక్షన్‌కి వెళ్ళి సరోజ ఈరోజు ఆఫీసుకు వచ్చిందేమో అడగండి...ఆమె రాలేదూ అంటే—రామం ఎందుకు రాలేదో తెలిసిపోయినట్లే!"

రామంమీద నాకు గొంతువరకూ కోపం వచ్చినమాట వాస్తవమే.

—ఈ ప్రపంచంలో ఇలా నీతులు చెప్పి, మరొకరు వేలెత్తిచూపే వాళ్ళల్లో ఎంతమంది నిజాయితీపరులో, ఎంతమంది సన్మార్గంలో నడుస్తున్నారో అందరికీ తెలిసినవిషయమే.

నేను మాంసం ఎవరినీ తినవద్దు అనను. ఒకరికి ఒక విషయంమీద బోధించటం నానైజమే గాదు. కానీ అలా మాంసం తింటున్నవాళ్ళను బొమికలు మాత్రం మెళ్లో వేసుకొని తిరగవద్దు అంటాను...

—రామం బహిరంగంగా ఇంతమంది నోళ్ళల్లోపడి నానవల్సిన అవసరంలేదు!

ఊఁహూఁ...

రామానికి బుద్ధిచెప్పాలి.

ఒక వయిస్సువచ్చి, పెళ్లాం అనే అందమైన గృహంలో పిల్లలనే దీపాల్ని గూడా వెలిగించుకొని—ఇంకెందుకో ఈ వెధవ తిరుగుళ్ళు?...

"సారీ బ్రదర్!" అంటూ నా ఆలోచనలకు నన్ను వదలివేసి శాస్త్రి వెళ్ళిపోయాడు.

* * *

మరునాడు ఉదయాన్నే రామాన్ని మొట్టమొదటిసారిగా చూస్తూనే, "ఇవ్వాళ

శనివారం...మీ యింటికి సాయంత్రం వస్తున్నాను...మా చెల్లాయిని...మంచి భోజనంలాంటి టిఫిన్ చేసెయ్యమను!" అన్నాను వాడి భుజంమీద చేతులువేస్తూ.

వాడు ఫక్కున నవ్వాడు.

"సారీ బ్రదర్! వెధవ సెలక్షనూ నీవూనూ...ఇవ్వాళ మధ్యాహ్నం మా శ్రీవారు గోల్కొండలో ఆవిడగారి అమ్మగారింటికి వెళ్ళిపోతున్నవారలు... రహస్యం ... ఎవరితోనన్నా నోరు జారేవ్...మూడోనెలలోగా పుట్టింటికి వెళ్ళరావటం రివాజుట!" కన్నుగొట్టల్గా చెప్పాడు.

ఓరి భడవా!...అంతేనా! లేక ఏ సుందరితోనైనా ఎంగేజ్‌మెంటు ఫిక్సయిందా సాయింత్రానికి!...

ఎలా అడగగలను?...

—నేను తేరుకునేటప్పటికి కొద్ది క్షణాలే హరించుకుపోయినయి. తేరుకుని "కంగ్రాచ్యులేషన్స్‌రా!" అన్నాను.

"థాంక్యూ."

ఇన్ని ఏడుపులతోగూడా సంసారాన్ని సరిగ్గానే ఈదుకొస్తున్నాడూ అంటే —'అరేయ్! రామం...హేట్సాఫ్!'

—అసలు పీడినిగురించిన సరయిన సమాచారం మనకు అందాలి అంటే ఆయనగారి శ్రీవారినుండే పొందాలి!

ఆల్‌రైట్...

రామం మధ్యాహ్నం పెళ్లాన్ని పుట్టింటికి పంపేటందుకుగాను అర్ధరోజు శెలవుపెట్టి ఇంటికి వెళ్ళిపోయాడు.

తరువాత గంటకు — నాకెందుకో అనుమానమొచ్చి — బి సెక్షనుకు వెళ్ళి సరోజ వున్నదేమోనని చూశాను.

సరోజాలేదు!

—నాకు నవ్వు వచ్చింది. రామంమీద నా చెడిపోయిన మనస్సును బాగుపరుచుకోవడం చాలా కష్టమయిన పనే!

* * *

శనివారం అవ్వడంతో సాయంత్రం గుళ్లోకివెళ్ళి కొబ్బరికాయ కొట్టి వచ్చాను. తరువాత ఏంచేయాలో తెలియలేదు. దేవదాసు చూద్దామా అనిపించింది.

సూర్యుడు పడమటి మేడలవెనక్కి జారిపోతున్నాడు.

చలిగాలి అదనుకోసరం చూస్తున్నట్లుగా ఆగి, అవకాశాన్ని ఉపయోగించుకొని బయటకు వచ్చింది.

ఇంకో పావుగంటలో సినిమా ప్రారంభమౌతోంది.

త్వరత్వరగా అడుగులువేశాను— జనాన్ని తప్పుకుంటూ.

ఎదురుగ్గా రామం!

—అతడి పక్కగా ఓ అందమైన యువతి.

నాకు తలతిరిగిపోయింది.

—పుట్టింటికి పెళ్లాన్ని పంపి ఇంకా కొద్దిగంటలయినా కాలేదు. అప్పుడే

మరోదాన్ని వేసుకొని రోడ్లమ్మట తిరగడమా?

నాకు రామం అంటే అసహ్యమే వేసింది.

—కోపంతోనూ, బాధతోనూ ముక్కుపుటాలు ఎగిరెగిరి పడుతున్నయ్.

అక్కడ నిల్చోవటమే తప్పన్నట్లుగా వెనక్కు తిరగబోయానుగాని—వాడు నన్ను చూడనే చూశాడు.

"అరే వెధవాయ్! కమాన్... బుకింగ్ కూడా తెరుస్తున్నారు...టిక్కెట్లు పట్టుకువస్తాను ... ఇక్కడ నిల్చో!" అంటూ అపనిడే తెరిచిన బుకింగ్ దగ్గరకు పరుగెడుతున్నట్లుగా వెళ్లాడు.

ఒక్క క్షణం విసురుగా వాడివంక చూచాను.


వెళ్ళిపోదామా అనిపించింది.

మరుక్షణంలోనే ఇంకో ఆలోచనా మనస్సులో మెరుపులా మెరిసింది.

ఇదే నాకు చేతికి అందివచ్చిన అవకాశమేమోగూడా అనిపించగా ఏమాత్రం అలస్యం చేయకుండా ఆ వన్నెల విసనకర్రముందు నిలబడ్డాను.

—వాడిని గురించి వారికి తెలియబరచాలంటే ఇదే అదును!

"అమ్మడూ! నీవెవరో నాకు తెలియదు...మీ నాన్న ఎవరో, మీ అమ్మ ఎవరో నాకు తెలియదు...నీవు చదువుకున్నావో, లేదో నాకు తెలియదు...



అంతకు మించి నీకు లోకజ్ఞానం వున్నదో లేదో నాకు తెలియదు...వాడికేం మొగవాడు, ఎట్లా తిరిగినా చెల్లుబడికాగలిగిన వాడు...కానీ నీవు ఆడదానివే ... ఇప్పటికి కాకపోతే—ఇక మొగమనిషికి అర్ధాంగిగా వెళ్ళి సంసారం ఈదవలసిన దానివి...నీకిదేం బుద్ధి...[ఓసి నీదుంప తెగ!...అలా అమాయకంగా...జీవితంలో వంటయిల్లూ, భర్త తప్ప తెలియని ఆడదానిలా మొఖం పెడతావేం ...ఉఁహూఁ...కాస్త కంఠం హెచ్చించి ...నాలుగు అబద్ధాలయినాచెప్పి భయపెట్టక తప్పదు] ఆఁ...నీకు వీడొక్కడే తెలిసినవాడేమో నాకయితే తెలియదు గాని...వాడికి మాత్రం నీ వొక్కదానివే గాదు...లక్షలు...లక్షలున్నారు...ఆఫీసులో సరోజవున్నది...వాడింటి వెనక వీధిలో పంకజాక్షి వున్నది...ముందు వీధిలో కామాక్షి వున్నది...వాళ్ళ ఊళ్లో నీలవేణి వున్నది...లాడ్జీలలో రోజుకొక ఆడదివున్నది...వాడు రాత్రికొక వీధి భాగవతం ఆడుతుంటాడు—వాడు వాళ్ళ నాన్నకు ఒక్కడే కొడుకు ... వాడి పెళ్ళామూ వాళ్ళ నాన్నకు ఒక్కతే కూతురు...వాళ్ళకు కట్టుకుపోయినంత ఆస్థి వున్నది...అంతేగాదు ... వాడికి వంటినిండా రోగాలపుట్టవున్నది ... కనుక అన్నీ తెలుసుకొని మసలుకో... బుద్ధితెచ్చుకొని బ్రతుకు...మంచివాడూ అనుకున్న ఒక మొగవాడినిచూచి వాడిచేత మూడుముళ్ళూ వేయించుకొని హాయిగా జీవించు. (ఇక ఆపేసి పరుగెత్తరా నాన్నా!...రామానికి టిక్కెట్లు దొరికినయి ... వెధవ! ఎగురుకుంటూ వస్తున్నాడు)

* * *

"అరేయ్! గాడిదా! ...రాత్రి దాన్నేమిటిరా అన్నావుట! కుమ్మేందుకు వస్తున్న ఆంబోతులా మీది మీదికి వస్తున్నాడు—మరునాడు ఉదయం ఆఫీసులో కాలుపెడుతుండగానే.

—నాకు తెలుసు వాడు అలా వస్తాడని—అందుకనే నా జాగ్రత్తలో నేనున్నాను...

"అనటమేమిటి!... ముఖం వాచేలా చివాట్లుపెట్టాను!" అన్నాను ముసి ముసి నవ్వులతో.

"నీ బొందపెట్టావు!...అది నా పెళ్లాంరా...గోల్కొండకు రిజర్వేషన్ దొరక్క ఊరికివెళ్ళకపోతే...బోరుగా వుందంటే సినిమాకు తీసుకొచ్చాను!..."

